క్లుప్తంగా

నాంచారమ్మ సేవలో డీసీ విజయరాజు



కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అధికారులు, పండితులు విజయరాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సోమ, మంగళవారాల్లో జరిగే అమ్మవారి ప్రధాన జాతర ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలయ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం దుశ్శాలువాలతో సత్కరించారు. ఈఓ పామర్తి సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం-1లో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుంది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పలు శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారు.

8న మెగా వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: ఎస్‌బీఐ పెన్షనర్లు, వినియోగదారులు, సిబ్బంది కుటుంబాలకు మచిలీపట్నం ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన ఎంజీ నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఎంజీ నాయుడు హాస్పటల్స్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై అధునాతన పరికరాలతో పరీక్షలు చేస్తారన్నారు. విశేష అనుభవం ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్థో ఎంఎస్‌లు శిబిరానికి హాజరై రోగులకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. బీపీ, షుగర్, ఎముకల అరుగుదల పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు.

నేడు రైతులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి షరతులు గల పట్టాలను తొలగించడంతో వీటిని ధ్రువీకరిస్తూ సోమవారం రైతులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా ఆదివారం తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించి పత్రాలను రైతులకు అందిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదగా వీటిని పంపిణీ చేస్తామన్నారు.

కృష్ణానది వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు

కోడూరు:విశ్వనాథపల్లి కృష్ణానది వద్ద మత్స్య శాఖ అధికారులు కటుద్దిమైన బారి కేడింగ్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని అద్దంకి నాంచారమ్మ జాతరను పురస్కరించుకొని నదిలో స్నానాలు ఆచరించేందుకు సోమ, మంగళవారాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. అయితే గతంలో జాతర సమయంలో పలువురు భక్తులు ఈ నది ప్రాంతంలో మృత్యువాత పడడంతో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టారు. నదిలో పోల్స్, బాదులు ఏర్పాటు చేసి వాటి చుట్టూ ఐరన్ మెస్‌ను, హెచ్చరిక బోర్డులను అమర్చారు. మత్స్యకారులతో బోట్లపై గస్తీ నిర్వహించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా, ఎఫ్‌డీఓ సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఘనంగా క్షేత్ర వార్షికోత్సవం

చల్లపల్లి: హరిహర పుత్ర అయ్యప్పస్వామి వారి క్షేత్రం ఆరో వార్షికోత్సవం స్థానిక నిమ్మలతోటలోని దేవాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం తరపున గ్రామ దేవత సంపటాలమ్మ అమ్మవారికి సారె సమర్పణ, భక్తులకు అన్న సమారాధన చేశారు.

అప్‌గ్రేడ్‌తో ఆదరణ

- కోడూరు ఎంపీయూపీ పాఠశాల జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్
- తొమ్మిది, పది తరగతుల నిర్వహణకు అనుమతి



కోడూరు జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన ఎంపీయూపీ పాఠశాల

కోడూరు: స్వాతంత్య్రానికి ముందు ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన నూతన విద్యా విధానంతో అపూర్వ వైభవం లభించింది. దివిసీమలోని సముద్రతీర ప్రాంతమైన కోడూరు నడిబొడ్డున బ్రిటిష్ కాలంలోని 1940 సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. దివిసీమలోని అనేక మంది ప్రముఖులు ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. కాలక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. 2016 నాటికి పాఠశాలలో 22 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో ఈ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం సన్నాహాలు చేసింది.

గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య

2017లో ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన కాశీభొట్ల నాగభూషణం విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తీవ్రంగా శ్రమించారు. తోటి ఉపాధ్యాయులతో కలిసి గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాల విద్యపై అవగాహన కల్పించడంతో పాటు అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరిగారు. దీంతో 2017-18 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 85కు చేరింది. పాఠశాలలో విద్యా బోధనపై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడటంతో 2018-19 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 130కు పెరిగింది. తరువాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం, విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టడంతో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2019-20 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 202కు చేరింది. తరువాత కోవిడ్ పరిస్థితులు కారణంగా పాఠశాలలు మూతబడగా.. అనంతరం 2022-23 విద్యా సంవత్సరంలో పాఠశాలలు పూర్తిస్థాయిలో తెరవగా ఈ ఏడాది ఎనిమిది తరగతి వరకు 322 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు.

జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్

కోడూరు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నుంచే పాఠశాలలో తొమ్మిది, పది తరగతుల నిర్వహణకు అనుమతి వచ్చింది. అయితే ప్రస్తుతం విద్యా సంవత్సరం చివరలో ఉండడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో జెడ్పీ పాఠశాలగా తీర్చిదిద్దనున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇప్పటికే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి తొమ్మిది, పది తరగతుల్లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు.

పెరిగిన ఉపాధ్యాయ పోస్టులు

జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడంతో ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరిగింది. 11 స్కూల్ అసిస్టెంట్, రెండు ఎస్‌జీటీ అర్హత ఉన్న ఉపాధ్యాయులతో పాటు పీడీ, గ్రేడ్ హెచ్‌ఎంను కూడా పాఠశాలకు కేటాయించారు.



పదో తరగతి వరకు ఇక్కడే చదువుతా

8వ తరగతి అవగానే వేరే స్కూల్‌కు వెళ్లాలని చాలా బాధపడేదానిని. జగన్ మామయ్య మాకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా మా పాఠశాలలోనే పదో తరగతి వరకు చదువుకునేందుకు అవకాశం కల్పించారు. విద్యా బోధన కూడా బాగుంది. ప్రతి రోజు మధ్యాహ్నం చక్కటి భోజనం, కోడిగుడ్డు పెడుతున్నారు. – బడే నాగవనజ, 8వ తరగతి, విద్యార్థి



ఆనందంగా ఉంది

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడం ఆనందంగా ఉంది. పిల్లలను దూర ప్రాంతాలకు పంపకుండా పదో తరగతి వరకు ఇక్కడే చదివించుకునేందుకు అవకాశం కలిగింది. పంచాయతీ అధికారులు గతంలో తీర్మానం చేసిన విధంగా విద్యార్థులకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణాన్ని కూడా సమకూర్చాలి.
– దావు మల్లి, పీఎంసీ కమిటీ చైర్మన్



పదో తరగతి వరకు అడ్మిషన్లు

కోడూరు ఎంపీయూపీ పాఠశాలను జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి, పదో తరగతి వరకు అడ్మిషన్లు ఇస్తున్నాం. ఈ ఏడాదే తరగతుల నిర్వహణకు అనుమతి లభించినప్పటికి విద్యా సంవత్సరం చివర కావడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో తరగతులను ప్రారంభిస్తాం. పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయులను కూడా నియమించాం.
– టీపీఎం రామదాసు, ఎంఈఓ

‘స్వచ్ఛ చల్లపల్లి’ దేశానికే ఆదర్శం

న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ



పబ్లిక్ టాయిలెట్ల ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి తదితరులు

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం 2,700 రోజుకు చేరిన సందర్భంగా ఆదివారం ఉదయం గ్రామంలో ఐదు కిలోమీటర్ల స్వచ్ఛతా నడక కార్యక్రమం నిర్వహించారు. వైద్య దంపతులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్-డాక్టర్ టి.పద్మావతి ఆర్థిక సహకారం రూ.6 లక్షలతో అభివృద్ధి చేసిన మహాత్మాగాంధీ స్మృతివనాన్ని సీనియర్ స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి ప్రారంభించారు. గ్రామ సచివాలయం-1 ప్రాంగణంలో డీఆర్కే దంపతులు రూ.12 లక్షలతో నిర్మించి, గ్రామ పంచాయతీకి అప్పగించిన పబ్లిక్ టాయిలెట్లను సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రధాన కూడలిలో సరైన మరుగుదొడ్లు లేక ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న నేపథ్యంలో డీఆర్కే దంపతులను సంప్రదించగా నిర్మించ తలపెట్టిన పబ్లిక్ టాయిలెట్లు ఇన్నాళ్లకు సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళాలు..

స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమానికి విశ్రాంత పంచాయతీ ఉద్యోగి కంఠంనేని రామబ్రహ్మం రూ.లక్షా ఐదు వేలు, ఆర్యవైశ్య ప్రముఖులు అన్నవరపు పాండురంగారావు రూ.15 వేలు, పారిశ్రామికవేత్త గుత్తికొండ కోటేశ్వరరావు రూ.10,116, చల్లపల్లి క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ వారు రూ.5వేలు, ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి రూ.5వేలు విరాళాలుగా అందించారు. గాంధీ భక్తుడు తమ్మన ప్రసాద్ గాంధీ స్మృతివనంలో నిర్మాణాలు చేపడితే రూ.లక్ష విరాళం అందిస్తానని ప్రకటించారు. ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సభ్యులు, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు, ఎస్‌ఆర్‌వైఎస్పీ కళాశాల వాకర్స్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వాసవీ క్లబ్ నిర్వాహకులు, మోటారు సైకిల్ మెకానిక్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలన ఎంతో బాగుంది

గడప గడపకు మన ప్రభుత్వంలో పేర్ని కిట్టుతో మహిళలు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన తనకు ఎంతో ఉపయోగపడుతోందని పలువురు మహిళలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) 21వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా కుటుంబాల్లో అన్ని అవసరాలు తీరుతున్నాయని చెప్పారు. విద్య, వైద్యంతో పాటు సంక్షేమం తమకు పూర్తిస్థాయిలో అందుతున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంక్‌లో డ్వాక్రా సున్నా వడ్డీ నిధులు పడటం లేదని, ఈ ప్రాంతంలోని కొన్ని భూములకు పట్టాలు ఇప్పించాలని ఆ ప్రాంతవాసులు పేర్ని కిట్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ రెండు సమస్యలను తాను దగ్గరుండి పరిష్కరింపజేస్తానని కిట్టు వారికి హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కార్పొరేటర్ మన్నే శారద, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, కార్పొరేటర్ ఐనం తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, పడమట రమేష్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో అందం, ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): సైక్లింగ్ చేసేవారు అందంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకట్రావు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్దీ ఉమెన్ హెల్దీ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థినులు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పరాసుపేట సెంటర్ నుంచి కలెక్టర్ బంగ్లా వరకు సాగింది. వెంకట్రావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ సుదర్శన్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని శారీరక, మానసికోల్లాసానికి సైక్లింగ్ దోహదం చేస్తుందని చెప్పారు. టీబీ పబ్లిక్ అండ్ ప్రైవేట్ కో-ఆర్డినేటర్ పి. మధుసూదనరావు, డీఆర్‌డీబీ కో-ఆర్డినేటర్ ధనలక్ష్మి, స్టార్ కళాశాల డైరెక్టర్ శ్రీరాం, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పెడన: ప్రతి నెలా పౌర్ణమి ముందు రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సును నడుపుతున్నామని మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్దిరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం పెడన నుంచి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సును స్థానిక పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షిణకు మచిలీపట్నం నుంచి ప్రత్యేక బస్సు వేశామని, ఈ బస్సు పెడన నుంచి రాత్రి 7.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. ప్రతి నెలా పౌర్ణమి ముందు రోజు రాత్రి 7.30 గంటలకు ఈ బస్సు బయల్దేరి మరుసటి రోజు ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, సిరిపురం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణకు సంబంధించి మచిలీపట్నం ఆర్టీసీ డిపోలోను, పెడన బస్టాండు సెంటర్‌లోని కొల్లూరి రాజా ఆర్టీసీ ఏజెంట్ల ద్వారా టికెట్లు పొందవచ్చునని తెలిపారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

మోపిదేవి ఎస్‌ఐ సీహెచ్ పద్మ



చల్లపల్లి: ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ఎదగాలని మోపిదేవి ఎస్‌ఐ సీహెచ్ పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక గీతా మందిరంలో మండల ఆర్యవైశ్య మహిళా విభాగ్, వాసవీ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే ఏ పరిస్థితినైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలన్నారు. మహిళలకు అనేక చట్టాలు రక్షణగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్, స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ టి.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎస్‌ఐ సీహెచ్.పద్మలను మహిళా విభాగ్ అధ్యక్షురాలు వరదా నాగమణి, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు విస్సంశెట్టి దుర్గాలక్ష్మిలు ఘనంగా సన్మానించారు.

చట్టాలపై వాహన చోదకులకు అవగాహన అవసరం

జిల్లా రవాణా శాఖాధికారి సీతాపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీతాపతిరావు

చిలకలపూడి(మచిలీపట్నం): వాహనచోదకులు మారుతున్న రవాణా చట్టాలు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖాధికారి టి. సీతాపతిరావు అన్నారు. నగరంలోని కల్యాణ మండపంలో టూ వీలర్స్ మెకానిక్స్ సంక్షేమ సంఘం 5వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి సీతాపతిరావు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేలు, మద్యం సేవించి వాహనం నడిపితే రూ. 10 వేలు జరిమానా విధిస్తామన్నారు. ఇవి కాకుండా జైలు శిక్ష విధించేలా చట్టాన్ని మార్పు చేశారని చెప్పారు. రవాణా శాఖ కార్యాలయానికి రాకుండానే కేవలం రూ. 1300లతో లెర్నింగ్ లైసెన్స్, పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్సును పొందవచ్చునని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన, పరివాహన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. రవాణా శాఖ ఆన్‌లైన్ ద్వారా 81 సర్వీసులను వాహనదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని వివరించారు. మెకానిక్‌ల సంఘం జిల్లా కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు, న్యాయవాది బాలాజీ, నగర కార్యదర్శి దాసరి శివనాగేంద్రం, పాలకవర్గ సభ్యులు రమణ, నాని తదితరులు పాల్గొన్నారు. 15 సంవత్సరాలుగా మెకానిక్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సుబ్బారావును గజమాలతో సత్కరించారు.

ఐడీఏ జిల్లా శాఖ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న డాక్టర్ శశిధర్

మచిలీపట్నంటౌన్: దంత సంరక్షణపై ప్రజలకు మరింత అవగాహన అవసరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం. శశిధర్ అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథి శశిధర్ మాట్లాడుతూ దంత సంరక్షణపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఐడీఏ జిల్లా శాఖతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉదయం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాక్స్ క్రికెట్ పోటీలను వైద్యుడు ధన్వంతరీ ఆచార్య ప్రారంభించారు. పోటీల్లో వైద్యుడు సుధాకర్ టీమ్ ప్రథమస్థానం పొందారు. సాయంత్రం ఐఎంఏ హాల్‌లో జరిగిన పోటీల్లో వైద్యులు హిందూజ (ప్రథమ), మహాలక్ష్మి (ద్వితీయ), లీలారాణి (తృతీయ) బహుమతులు పొందారు. కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌బెనర్జీ, కోస్టల్ ఆంధ్ర బ్రాంచ్ అధ్యక్షుడు గోవర్ధన్, కార్యదర్శి రాం సునీల్, రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ మెహబూబ్ పాల్గొన్నారు. విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సంఘ పనితీరును అభినందించారు. దంత వైద్యులు రావి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

కారు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పెడన: ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లపాడుకు చెందిన చిల్లిముంత సుబ్బారావు (55) ద్విచక్ర వాహనంపై శనివారం పుల్లపాడు నుంచి వయా నందమూరు మీదుగా మచిలీపట్నం బయలుదేరాడు. అదే సమయంలో పెడన నుంచి బంటుమిల్లి వైపుగా వెళ్తున్న కారు సుబ్బారావు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన సుబ్బారావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సుబ్బారావు కుమారుడు స్వామిఅయ్యప్ప ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ టి. సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

గూడూరు: గూడూరులో కొలువుదీరిన రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారితో పాటు అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జగత్‌జ్యోతి కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు.

నేడు అమలేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ

పెడన: పట్టణంలోని పడమటవారి వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమలేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహించేందుకు పడమట వంశీయులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 9.38 గంటలకు పడమట బ్రహ్మయ్య, క్రిష్టమ్మ వంశీయులచే పడమట విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. ఈ క్రతువుకు ముందుగా ఆదివారం సాయంత్రం మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

జాతర ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



పెదప్రోలు(మోపిదేవి): గ్రామదేవత జాతర ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో గ్రామస్తుల సహకారంతో నిర్వహించాలని చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ అన్నారు. పెదప్రోలు గ్రామంలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఈనెల 7వ తేదీ గుడి జాతర నిర్వహించనున్నారు. దీనితో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు, గ్రామస్తులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పాలకవర్గ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుర్రా గురుప్రసాద్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆదివారం దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారి దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ కృష్ణమాచార్యులు, పద్మజ, ఎన్. వెంకటరమణ, కమలకుమారి, ఏసీ శ్రీనివాసాచార్యులు, కల్యాణి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు పర్యవేక్షించారు.

నేడు మండలంలో మంత్రి, ఎంపీ పర్యటన

కృత్తివెన్ను: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సోమవారం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు తెలిపారు. మండల పరిధిలోని చినగొల్లపాలెం దీవిలో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ బ్రాంచిని వారు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు ప్రాథమిక పాఠశాలలో 1977-88 మధ్యకాలంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి గత స్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు విశ్రాంత ఉపాధ్యాయులు అప్పికట్ల లీలా అర్జునరావు, విజయవాడ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మండవ సాంబశివరావు, కోసూరువారిపాలెం ప్రధానోపాధ్యాయుడు పరిసే వెంకటేశ్వరరావు, కాకాని వెంకట రమణ, వెటర్నరీ వైద్యులు కుక్కల రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి ఇరువైపులా స్వాగతం పలుకుతూ ఆర్చ్‌లు నిర్మించాలని నిర్ణయించారు. అనంతరం ఏర్పాటు చేసిన యశశ్రీ కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, కొండూరు శ్రీనివాసరావు, నాదెళ్ల రామకృష్ణ, లక్ష్మీపురం కుటుంబరావు, అప్పికట్ల రాంబాబు, యడ్ల శ్రీనివాసరావు, మురాల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.